

బరువైన ఎరువు

దేశానికి అన్నంపెట్టే రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి వ్యయం పెరుగుతుండడం, గిట్టుబాటు ధరలేకపోవడంతో అప్పల పాలవుతున్నాడు. - 8లో



చాలీచాలని భోజనం - 8లో

బొబ్బిలి మండలం పిరిడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు చాలీచాలని మధ్యాహ్నభోజనం వడ్డించడంపై తల్లిదండ్రులు మండిపడ్డారు.



3.20 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 3.20 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలను రైతులు సాగు చేయనున్నట్టు వ్యవసాయాధికారి కె.ఆర్.పాల్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

గ్రామీణ వైద్యులకు మేలుచేసిన వైఎస్సార్

- గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ వైద్యులకు మేలు చేసిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్.కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన గ్రామీణ వైద్యుల సంఘం ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వడం కోసం జీఓ 429ను జారీచేశారని చెప్పారు. ఆయన అకాల మరణం గ్రామీణ వైద్యులకు తీరని లోటుగా పేర్కొన్నారు. వెంకటరామ ఆస్పత్రి ఎం.డి చిట్టి రమణరావు మాట్లాడుతూ పరిమితికి మించి గ్రామీణ వైద్యులు వైద్యం చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు ఐ.గోపాల రావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.ఎస్.శర్మ, కోశాధికారి వై.సోమేశ్వరి, కనకచారి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యాలయంలో ఆడిట్



ఏఎంసీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్న ప్రభావతి, ఇతర సిబ్బంది

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్‌యార్డు (ఏఎంసీ) కార్యాలయంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా ఆడిట్ సహాయ అధికారి సీహెచ్ ప్రభావతి తన బృందంతో ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.2కోట్ల13 లక్షలు ఆదాయం రాగా, రూ.కోటి57లక్షలు ఖర్చు చూపారన్నారు. రికార్డుల నిర్వహణ బాగుందని, మరో రెండు రోజుల పాటు ఆడిట్ జరుగుతుందని తెలిపారు. ఆడిట్ సిబ్బంది ఎం.కిశోర్, వెంకటరత్నం, టి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

6న గిరిజన వర్సిటీ పీజీ జర్నలిజం కోర్సులో స్పాట్ అడ్మిషన్

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ పీజీ కోర్సులకు జూలై 6న స్పాట్ ఎడ్మిషన్లు నిర్వహిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రిజర్వేషన్ల కోటాలోనూ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి, అర్హులైన విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు వర్సిటీ క్యాంపస్ ప్రాంగణానికి నేరుగా హాజరుకావాలని కోరారు.



ఇది కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి 2017 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించిన భూములు. కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని అప్పన్నదొరపాలెం సమీపంలో నిర్మాణాలకు ఏమాత్రం అనుకూలంగాలేని కొండ ప్రాంతమిది. గిరిపుత్రుల జీవితాల్లో వెలుగునింపాల్సిన ఈ విద్యాసంస్థ గిరిజన ప్రాంతానికి సామీప్యంలో లేకపోయినా కేవలం మైదాన ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారం పెంచుకోవడానికి ప్రచారాస్త్రం చేసుకోవాలన్నదే టీడీపీ నాయకుల ఉద్దేశం. యూనివర్సిటీ నిర్మాణానికి ఈ స్థలం ఏమాత్రం అనుకూలం కాదని కేంద్ర ప్రభుత్వ అధికారులు ఇచ్చిన నివేదికనూ తొక్కిపెట్టేశారు. 2017 డిసెంబర్‌లో అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆగమేఘాలపై శంకుస్థాపన చేసేశారు.



గిరిజనుల చెంతన, ఎస్టీ రిజర్వుడు సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన 561.88 ఎకరాల విస్తీర్ణంలోని భూములివి. ప్రకృతి రమణీయతతో అన్నివిధాలా అనువుగా ఉందని స్వయంగా పర్యటించి కేంద్ర అధికారులే సంతృప్తి వ్యక్తం చేసిన తర్వాతే యూనివర్సిటీ పాలకవర్గం ఆమోదముద్ర వేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2023 ఆగస్టు 25న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి మెంటాడ మండలం కుంటినవలస వద్ద శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇలా కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని గిరిజన ప్రాంతానికి తీసుకురావడంలో నాటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవ ప్రశంసనీయం. అంతేగాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన రూ.23.60 కోట్లతో మౌలిక వసతుల కల్పన ప్రక్రియ జోరందుకుంది.

గిరిపుత్రులపై కక్ష!

- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు టీడీపీ నాయకుల రక్ష?
- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తరలించేందుకు పన్నాగం
- కొత్తవలస పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెంపే లక్ష్యం
- విశాఖకు సామీప్యం అనే ముసుగులో విద్యాసంస్థతో ఆటలు
- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి విశ్వప్రయత్నాలు



కేంద్రీయ గిరిజన విద్యాలయానికి సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన చిత్రం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని గిరిపుత్రుల ఆకాంక్షలను గౌరవిస్తూ వారికొక గుర్తింపుగా ఏర్పాటు చేయడం మంచిదా? లేదంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలే పరమావధిగా, వ్యాపారాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో విద్యాసంస్థను మళ్లీ మైదాన ప్రాంతానికి తరలించుకుపోవడం మంచిదా? ఇప్పుడు జిల్లాలో ఇదే చర్చనీయాంశమైంది. వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన పథకాల పేర్లు మార్చేయడం, సాకారమైన ప్రజా ఆస్తుల శిలాఫలకాలను ధ్వంసం చేయడమే పని అన్నట్లుగా ప్రస్తుత టీడీపీ పాలన సాగుతోంది. ఇదే అదనుగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని గిరిజనుల ప్రాంతం నుంచి మైదానంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారుల లేఅవుట్ల మధ్యలోకి తరలించుకుపోవాలనే టీడీపీ నాయకుల పన్నాగాలు మొదలయ్యాయి.

టీడీపీ చేసింది శూన్యం...

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమల్లో భాగంగా 2014 సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 13 కేంద్రీయ విద్యాసంస్థలను మంజూరు చేసింది. వాటిలో ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ)ను ఉమ్మడి విజయనగరం జిల్లాకు కేటాయించింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017 సంవత్సరంలో కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద భూమి మంజూరుచేసింది. కానీ అది భారీ భవనాల నిర్మాణానికి అనుకూలంగా లేని పూర్తిగా కొండప్రాంతం. పరిసరాల్లో టీడీపీ నాయకులు, వారి బంధువులు, అనుయాయుల స్థిరాస్తి వ్యాపారాన్ని పెంచుకోవడానికి తప్ప మరెందుకూ ఉపయోగం లేకుండాపోయింది. చంద్రబాబు ప్రభుత్వం 2019 ఏప్రిల్ వరకూ అధికారంలోనే ఉన్నప్పటికీ భూసేకరణను పూర్తి చేయలేదు. ప్రభుత్వ భూమిలో మాత్రం కొంతమేర ప్రహరీ నిర్మించి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీటీయూ ఏపీ తరగతులను తప్పనిసరిగా ప్రారంభించాల్సి వచ్చింది. విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ పాత భవనాన్ని కేటాయించడంతో 2019 ఆగస్టు 5న తరగతులు ప్రారంభమయ్యాయి.

కేంద్ర బృందం సంతృప్తి...

సీటీయూ ఏపీకి కేటాయించిన భూమిని 2022లో పరిశీలించిన కేంద్ర బృందం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. సీటీయూ ఏపీ పాలకవర్గం ఆమోద ముద్ర వేసింది. మౌలిక వసతులను కల్పించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23.60 కోట్లను గత ఏడాదే విడుదల చేసింది. జాతీయ రహదారి నుంచి సీటీయూఏపీ ప్రాంగణం వరకూ రూ.16 కోట్ల వ్యయంతో వంద అడుగుల వెడల్పున ఆరు లైన్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాగునీటి సదుపాయం కల్పించేందుకు రూ.7 కోట్లను వెచ్చిస్తున్నారు.

అన్నివిధాలా ఆమోదయోగ్యం...

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ లక్ష్యం సార్థకమయ్యేలా గిరిజన ప్రాంతంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 224.01 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస రెవెన్యూ గ్రామ పరిధిలో 337.87 ఎకరాలు మొత్తం 561.88 ఎకరాల భూసేకరణను శరవేగంగా పూర్తి చేసింది. ఇది విశాఖపట్నం–రాయగడ జాతీయ రహదారికి, విశాఖ–హౌరా రైల్వేలైనులోని విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి రైల్వేస్టేషన్లకు సమీపంలో ఉంది. ప్రస్తుతం నిర్మాణంలోనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా దగ్గరే.

టీడీపీ పంతం ఎవరి కోసం...

కొత్తవలస మండలంలో టీడీపీ పెద్దనాయకుల బంధువులు, అనుచరులు 2014లోనే పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరదీశారు. ఒక్కొక్కటీ వందల ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్‌లు వేశారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కొత్తవలస నుంచి తరలిపోవడంతో ఆ వ్యాపారం కాస్త మందగించింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారం పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. మళ్లీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెనక్కి తెచ్చేస్తే తమ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగిపోతుందని ఆశిస్తున్నారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. వినతిపత్రాలు అందిస్తూ వస్తున్నారు. తాము భాగస్వాములుగా ఉన్న కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి అయినా గిరిపుత్రుల నుంచి గిరిజన కేంద్రీయ విద్యాలయాన్ని దూరం చేయాలనే కుట్రలు బలీయంగా సాగుతున్నాయి.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- బాధ్యతల చేపట్టిన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఆర్డీఓ సూర్యకళ, వివిధ విభాగాల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్లోకి ఆయన ప్రవేశించి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపిస్తానని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానన్నారు. గతంలో వివిధ హోదాల్లో జిల్లాలో పనిచేశానని, జిల్లా పరిస్థితులపై కొంతవరకు అవగాహన ఉందని తెలిపారు.

నేడు సీజనల్ వ్యాధులపై కలెక్టర్ తొలి సమీక్ష

సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వైద్యారోగ్యశాఖ, పంచాయతీ, తాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ కె.కార్తీక్

‘టెట్’లో ఉత్తమ ప్రతిభ

అభ్యర్థి పేరు	పరీక్ష	మార్కులు
కోండ్రు అశ్విని (విజయనగరం)	ఎస్‌జీటీ	146/150
యేళ్లంటి గణేష్ (చీపురుపల్లి)	ఎస్‌జీటీ	143.58/150
దేవ హారిక (చీపురుపల్లి)	ఎస్‌జీటీ	142.24/150
బాలి కుమారి (పత్తికాయవలస)	ఎస్‌జీటీ	141.40/150
పెదిరెడ్ల రామలక్ష్మి (కుంటినివలస)	మాథ్స్ అండ్ సైన్స్	131.6/150
పల్లె చంద్రకళ (అయ్యన్నపేట)	సోషల్ అసిస్టెంట్	136.38/150

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో ఈ పరీక్షకు 11,530 మంది దరఖాస్తు చేసుకోగా 1,500 మంది గైర్హాజరుతో పరీక్షరాశారు. సెకెండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) అర్హత పరీక్ష పేపర్–1, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల అర్హత పరీక్ష పేపర్–2, ప్రత్యేక విద్య ఉపాధ్యాయ అర్హత పరీక్ష పేపర్–1బీ, పేపర్–2బీగా పరీక్షలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అధిక మార్కులు సాధించారు.

ఏనుగుల మెడలో మృత్యుగంట

- విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యంతో తనువుచాలిస్తున్న ఏనుగులు
- మరోవైపు ఆహారం కోసం అన్వేషణ
- ఆ క్రమంలో పంటలు నష్టం
- రైతులనూ పొట్టనబెట్టుకుంటున్న వైనం



గరుగుబిల్లి మండలం తోటపల్లిలో మృతిచెందిన ఆడ ఏనుగు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఆహార అన్వేషణలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాన్ని దాటుకుంటూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల మెడలో నిరంతరం మృత్యుగంట మోగుతోంది. ఇక్కడి పొలాలు, నదీ తీర ప్రాంతాల్లో సంచరిస్తూ విద్యుత్ ప్రమాదాలు, ఊబిలో చిక్కుకుని, అనారోగ్యంతో మృతి చెందుతున్నాయి. పంటల్లో సంచరించే సమయంలో ఏనుగులకు తారసపడిన రైతన్నలను సైతం పొట్టనబెట్టుకుంటున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. దీనికి అంతం ఎప్పుడన్నది మన్యం జిల్లా ప్రజలను తొలిచేస్తున్న ప్రశ్న. తాజాగా గరుగుబిల్లి మండలం తోటపల్లి సరిహద్దుల్లో అనారోగ్యంతో ఓ ఆడ ఏనుగు మృతి చెందింది. ఏళ్లుగా అటు అమాయక గిరిజనులతో పాటు.. ఇటు ఏనుగుల ప్రాణాలుపోతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించకపోవడం విచారకరం.

ఒడిశా నుంచి జిల్లాలోకి...

ఒడిశా రాష్ట్రం లఖేరి నుంచి తొలిసారిగా 1998 అక్టోబర్ 4న కురుపాం అటవీ ప్రాంతంలోకి ఏనుగులు ప్రవేశించాయి. వాటిని తరిమేసినా.. 1999 ఆగస్టులో కురుపాం, గుమ్మలక్ష్మీపురం కొండల్లోకి వచ్చాయి. మళ్లీ వాటిని వెనక్కి పంపారు. 2007–08 సంవత్సరాల మధ్య గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, సీతంపేట, వీరఘట్టం ప్రాంతాల్లో పంటలను తీవ్రంగా నష్టపరిచాయి. ఆ సమయంలో వాటిని తరిమికొట్టేందుకు ‘ఆపరేషన్ గజ’ను చేపట్టారు. ఏనుగులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి ఒడిశా తరలిస్తుండగా రెండు మృతి చెందాయి. దీంతో ఆ ఆపరేషన్‌ను నిలిపివేశారు. అప్పట్లో ఉమ్మడి విజయనగరం–శ్రీకాకుళం జిల్లాల మధ్య ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినా గిరిజనుల వ్యతిరేకత నేపథ్యంలో నిలిచిపోయింది.

జోన్‌తోనే సంరక్షణ!

కరి రాజులు ఆహారం, నీటి కోసం తరచూ జనావాసాల మధ్యకు వస్తున్నాయి. దీంతో గిరిజనుల పంటలు ధ్వంసం కావడంతో పాటు, పలువురు ఏనుగుల దాడిలో ప్రాణాలూ కోల్పోతున్నారు. ఇవి జనావాసాల మధ్యకు రాకుండా సాలూరులో జంతికొండ, కురుపాం పరిధిలోని జేకే పాడులో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు 2020 డిసెంబర్‌లో అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. జంతికొండలో 526 హెక్టార్లు, జేకే బ్లాక్‌లో 661 హెక్టార్లలో అటవీ భూమిని గుర్తించారు. ఆ తర్వాత ఆ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. తర్వాత కూడా ఏనుగుల సంరక్షణకు పార్వతీపురం మండలం డోకిశీల, చందలింగి, కొమరాడ మండలం పెద శాఖ, పాత మార్కొండపుట్టి ప్రాంతాలను పరిశీలించారు. చివరకు సీతానగరం మండలం జోగింపేట అడవులను ఏనుగుల పునరావస కేంద్రం కోసం ఎంపిక చేశారు. ఇప్పటి వరకూ ఏదీ కార్యరూపం దాల్చలేదు.

ఆహార అన్వేషణలో మృత్యువాత

2018 సెప్టెంబర్ 7న శ్రీకాకుళం జిల్లా నుంచి ఎనిమిది ఏనుగుల గుంపు జియ్యమ్మవలస మండలంలోకి ప్రవేశించింది. అదేనెల 16న అర్తాం వద్ద విద్యుదాఘాతానికి గురై ఒక ఏనుగు ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత దుగ్గి సమీపంలోని నాగావళి ఊబిలో కూరుకుపోయి మరో ఏనుగు మృత్యువాతపడింది. అంతకుముందు 2010 నవంబర్‌లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం మండలం కుంబిడి ఇచ్ఛాపురంలో రెండు ఏనుగులు మృతి చెందాయి. గతంలో సాలూరు మండలంలో ఒక ఏనుగు విద్యుదాఘాతానికి గురై, ప్రాణాలు వదిలింది. కొన్నాళ్ల కిందట ‘హరి’ అనే మగ ఏనుగు గుంపు నుంచి తప్పిపోయింది. నెలలు గడిచినా దాని జాడ తెలియరాలేదు. గుంపులో కలవలేదు. గతేడాది మే నెలలో జిల్లాలోని భామిని మండలం కాట్రగడ బీ వద్ద విద్యుదాఘాతంతో నాలుగు ఏనుగులు మృత్యువాత పడ్డాయి. ఏనుగుల గుంపు ఇక్కడికి వచ్చిన తర్వాతే మరో మూడు ఏనుగు పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా గరుగుబిల్లి మండలంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆడ ఏనుగు గర్భంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఆహార అన్వేషణలో భాగంగా అడవులను వదిలి, జనావాసాల మధ్యకు వస్తున్న ఏనుగులు.. విద్యుదాఘాతాలకు, రైతులు పంటల కోసం ఏర్పాటు చేసుకున్న రక్షణ కంచెలతో ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నాయి.

అటు ప్రాణ నష్టం.. ఇటు పంటల ధ్వంసం

ఏనుగులు దాడి చేయడంతో విలువైన మనుషుల ప్రాణాలూ పోతున్నాయి. 2019 జనవరిలో కొమరాడ, జియ్యమ్మవలస మండలాలకు చెందిన నిమ్మక పకీరు, కాశన్నదొర ప్రాణాలు కోల్పోయారు. జిల్లాలో గజరాజుల ప్రవేశం నుంచి ఇప్పటి వరకు వాటి దాడిలో 12 మంది వరకూ మృతి చెందగా.. అనేక మంది గాయాలపాలయ్యారు. వేలాది ఎకరాల పంటలను ఇవి ధ్వంసం చేశాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించినా.. తిరిగి జిల్లాకు చేరుకుని కొమరాడ, పార్వతీపురం, జియ్యమ్మవలస, భామిని, సీతంపేట, గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల సంఖ్యను నిర్ధారించేందుకు మూడు రోజులపాటు అటవీ శాఖాధికారులు సర్వే చేపట్టారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో ఏడు, పాలకొండ డివిజన్ పరిధిలో నాలుగు ఏనుగులు తిరుగుతున్నట్టు గుర్తించారు. అందులో ఒకటి మంగళవారం ప్రాణాలు కోల్పోయినట్టు భావిస్తున్నారు.

క్లుప్తంగా

బదిలీ కలెక్టర్‌ను సత్కరించిన మంత్రి



కలెక్టర్‌ను అభినందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొంపల్లి శ్రీనివాస్ దుశ్శాలువతో సత్కరించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు మంత్రి శ్రీనివాస్ కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు.

నేటికీ అందని విద్యా సామగ్రి



చిరిగిన బ్యాగులు

నెల్లిమర్ల రూరల్: పాఠశాలలు పునఃప్రారంభమై పదిరోజులైన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఏకరూప దుస్తులు నేటికీ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినప్పటికీ బ్యాగులు, ఏకరూప దుస్తులు అందించకపోవడంతో చినిగిన బ్యాగులు, దుస్తులతోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా పాఠశాలల ప్రారంభం నాడే విద్యార్థులకు బ్యాగులు, యూనిఫారం, ఇతర సామగ్రిని విద్యాశాఖ ద్వారా అందించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 42 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా.. అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. త్వరలోనే విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

29 కిలోల గంజాయి సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రైల్వేస్టేషన్ పరిధిలో ప్లాట్‌ఫామ్‌ల తనిఖీల్లో రూ.లక్షా 45 వేల విలువైన గంజాయిని జీఆర్‌పీ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అన్సూ, శివ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.లక్షా 45 వేల విలువైన 29 కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను వెలికితీయడంలో విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీసు ప్రత్యేక టీమ్‌ల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటుచేసి విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు విస్తృతం చేశామన్నారు. సమావేశంలో రైల్వే ఎస్సై రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹148	₹266	₹276

బరువైన ఎరువు

- సతమతమవుతున్న అన్నదాత
- అమాంతం పెరిగిన ధర
- పంటకు గిట్టుబాటు లేక రైతు అప్పుల పాలు
- సేంద్రియ వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారుల సూచన



ఓ షాపులో నిల్వ ఉన్న ఎరువులు

పూసపాటిరేగ: దేశానికి అన్నంపెట్టే రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి వ్యయం పెరుగుతుండడం, గిట్టుబాటు ధరలేకపోవడంతో అప్పుల పాలవుతున్నాడు. పెరిగిన ఎరువుల ధరలు రైతులను మరింతగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో వ్యవసాయం చేయడానికి రైతులు సంశయిస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో రసాయిన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. పూసపాటిరేగ మండలంలో 7200, డెంకాడ మండలంలో 6400, భోగాపురం మండలంలో 5300, నెల్లిమర్ల మండలంలో 6700 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఎరువుల ధర గణనీయంగా పెరగడంతో సాగు ఎలా చేయాలోనని రైతులు మధన పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీతో ఎరువుల ధర 5 శాతం, పురుగు మందుల ధర 18 శాతం పెరిగింది. పెరిగిన ధరలతో రైతులు బెంబేలెత్తుతుంటే ఎరువుల కంపెనీలు మరో 10 శాతం ధర పెంచాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంట దిగుబడి పెంచేందుకు రసాయన ఎరువులు వాడకం అమాంతం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎరువుల ధర కొండెక్కడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి. సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపాలి. పశువుల పేడతో పాటు జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు పొలంలో వేసి కలియదున్నాలి. దీంతో రసాయన ఎరువులు, పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం ఉండదు.

– కె. నీలిమ, వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

గతంలో పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం అధికంగా ఉండేది. కానీ కాలక్రమేణా పోటీ తత్వంతో రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. మితిమీరి రసాయన ఎరువుల వాడకం వల్ల వాతావరణంలో కాలుష్యంతో పాటు, ఎరువులతో పండించిన పంటలు తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

3.20 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్

- జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో గత ఖరీఫ్‌లో మాదిరిగానే ఈ ఖరీఫ్‌లో కూడా 3.20 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంటల సాగులో రైతులకు అందించవలసిన సేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఒక లక్ష ఎకరాల్లో ఉంటే.. వరి, ఇతర పంటలు 2.20 లక్షల ఎకరాల్లో సాగవనున్నాయన్నారు. జిల్లాలో గల 306 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందస్తుగానే 22,131 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఇప్పటివరకు 19వేల క్వింటాళ్ల వరి విత్తనాలను 32,439 మంది రైతులకు 90 శాతం రాయితీపై, 1900 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను 6,600 మంది రైతులకు 90 శాతం రాయితీపై అందించినట్లు చెప్పారు. 19,000 టన్నుల ఎరువులను ఆర్బీకేలు, సొసైటీలు, వ్యాపారుల వద్ద సిద్ధంగా ఉంచామన్నారు. యూరియా బస్తా రూ.266.50, డీఏపీ బస్తా రూ.1350, కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1470, 2020213 బస్తా రూ.1250, 28280 బస్తా రూ.1700, పొటాష్ బస్తా రూ.1625, సూపర్ ఫాస్పేట్ బస్తా రూ.600, బి.రకం బస్తా రూ.64లు చొప్పున ధర నిర్ణయించామని వివరించారు. రైతులంతా ఈ ధరలకు మించి ఎరువులను కొనుగోలు చేయరాదని పిలుపునిచ్చారు. జిల్లాలో 11,000 మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపామని, జూలై నెలాఖరులోగా భూసార పరీక్ష ఫలితాలు వస్తాయన్నారు. ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని రైతులను కోరారు. ఆయన వెంట కురుపాం ఎ.డి నిర్మల జ్యోతి, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల వ్యవసాయాధికారులు సీహెచ్ ప్రసాద్, పి. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: డయేరియాపై స్పందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తుందని చెప్పారు. గత ఏడాది దత్తిరాజేరు మండలంలోని పెదకాద, డెంకాడ మండలంలోని పెదతాడివాడ, చినతాడివాడ, నెల్లిమర్ల మండలం ఏటీ అగ్రహారం, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందిందని, ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నలుగురు సభ్యులు ఉంటారని, అదేవిధంగా పీహెచ్‌సీలో కూడా డయేరియాపై ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందినట్లయితే ఆ కమిటీకి తెలియజేయాలని చెప్పారు. కేసులు ఎక్కువ నమోదైతే జిల్లా కేంద్రంలో ఉన్న కమాండ్‌కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తారని చెప్పారు.

వృద్ధురాలికి పాముకాటు

వంగర: మండల కేంద్రం వంగరకు చెందిన వృద్ధురాలు దేవకివాడ తులసమ్మ మంగళవారం పాముకాటుకు గురైంది. ఇంటిలో పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో హుటాహుటిన వంగర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రాజాం సీహెచ్‌సీకి తరలించారు. ఆమె కోలుకుంటోందని కుటుంబసభ్యులు తెలిపారు.

చోరీ బంగారం రికవరీ: నిందితుడి అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: బొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఎం.సత్యం కోల్పోయిన బంగారాన్ని రికవరీ చేసినట్లు గజపతినగరం ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాసారపు సత్యం 14వ తేదీన తమ అవసరాల నిమిత్తం 63.18 గ్రాముల బంగారాన్ని బొండపల్లి గ్రామం నుంచి గజపతినగరంలోని ఓబ్యాంక్‌లో తాకట్టు పెట్టేందుకు ఆటోలో బయలుదేరి వస్తున్నాడు. మార్గమధ్యంలో ఓ వ్యక్తి బంగారంతో ఉన్న బ్యాగ్‌ను పట్టుకుని పరారయ్యాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో అదే రోజు బాధితుడు సత్యం ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం బంగారాన్ని దొంగిలించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారాన్ని రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ సత్యన్నారాయణ, దామోదర్‌లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో అనుమానాస్పదంగా ఒక వ్యక్తి మృతిచెందాడు. దీనిపై స్థానిక ఎస్సై వై.అమ్మాన్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఏగిరెడ్డి వెంకటరమణ(47) సోమవారం తన పొలంలో పురుగు మందు పిచికారీ చేసి రాత్రి ఇంటికి వచ్చి మంచంపై పడుకున్నాడు. భార్య భవాని మంగళవారం తెల్లవారు జామున భర్తను చూసి చనిపోయినట్లు గమనించి చుట్టుపక్కల వారికి తెలియజేయగా వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం మేరకు పోలీసులు మంగళవారం ఘటనాస్థలానికి వచ్చి మృతిచెందిన వ్యక్తిని పరిశీలించి శరీరమంతా పలుచోట్ల గాయాలతో పాటు రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు వెంకటరమణ, భార్య భవానీల మధ్య కొంతకాలంగా చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయని పోలీసుల విచారణలో స్థానికులు చెప్పారు. మృతుడి కుమార్తె ధనుష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

- పరారీలో ఉన్న వారి కోసం గాలింపు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: కిడ్నాప్ కేసులో నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని డకినివీధిలో రాజస్థాన్‌కు చెందిన భగవాన్ రామ్ గ్యాస్ స్టవ్‌ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న భగవాన్ రామ్ ఉండే ప్రాంతానికి రాజస్థాన్ నుంచి బిజిలారామ్, కొంతమంది వ్యక్తులు వచ్చి, అతనితో మాట్లాడి, కారులో ఎక్కించుకుని వై జంక్షన్‌కు వద్దకు తీసుకువెళ్లి, అక్కడ మద్యం తాగి, తమ ఆడవారికి అసభ్యకర మెసెజ్‌లు పంపిస్తున్నాడనే నెపంతో భగవాన్ రామ్‌ను తీవ్రంగా కొట్టి, బలవంతంగా కారులో బెంగళూరు తీసుకువెళ్లేందుకు బయల్దేరారు. మార్గమధ్యంలో కారు ఆపి, ఒక బాటిల్‌లో మూత్రం పట్టి బలవంతంగా తాగించి, వీడియో రికార్డ్ చేశారు. అతని స్నేహితుడికి ఫోన్ చేయించి బలవంతంగా రూ. 35 వేలు తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి, భగవాన్‌రామ్‌ను విడిచిపెట్టి పరారయ్యారు. భగవాన్‌రామ్ విజయనగరం చేరుకుని ఎటువంటి ఫిర్యాదు చేయకుండా ఉన్నాడు. నిందితులు తీసిన వీడియోలను రాజస్థాన్‌లో వైరల్ చేశారు. ఈ విషయం భగవాన్ రామ్‌కు తెలియడంతో జూన్ 22న ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు పోలీసులు నిందితుల్లో ఒకడైన దేవాసి వజీరామ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

మంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా కమిటీ సభ్యులు ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు మంగళవారం విన్నవించారు. జెడ్పీ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రవిచంద్రశేఖర్, జీవీఆర్‌గోపాల్ వర్మ, అల్లార రమణ, వాడాడ గౌరీశంకర్, అరుణ్‌కుమార్, హేమంత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసిన క్రెడాయ్ చాప్టర్ ప్రతినిధులు బోస్, తదితరులు

విజయనగరం టౌన్: క్రెడాయ్ విజయనగరం చాప్టర్ ప్రతినిధులు రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. క్రెడాయ్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఉన్నందున చాప్టర్ తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిర్మాణరంగానికి సంబంధించిన పలు విషయాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ కె.సుభాష్ చంద్రబోస్, చైర్మన్ వి.పార్థసారథి, అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, కార్యదర్శి రాజశేఖర్, చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ అధికారిని నియమించండి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో పనిచేసిన అధికారి ఉద్యోగ విరమణ చేసి రెండు నెలలవుతున్నా ఇంతవరకు రెగ్యులర్ అధికారిని నియమించలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు.

చాలీచాలని భోజనం



భోజనం లేదంటూ ఖాళీ కంచాలు చూపుతున్న విద్యార్థులు

- అర్ధాకలితో విద్యార్థులు
- మధ్యాహ్నభోజన నిర్వాహకుల నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తంచేసిన తల్లిదండ్రులు



నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజన పథకంపై అజమాయిషీ కొరవడింది. ఫలితం.. విద్యార్థులు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. బొబ్బిలి మండలం పిరిడి ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు వండాలి. కేవలం 200 మందికి సరిపడా వంటలు మాత్రమే మంగళవారం చేశారు. పులిహోరాతో పాటు గుడ్డును విద్యార్థులకు పెట్టాల్సి ఉండగా, 60 మంది విద్యార్థులకు గుడ్లు లేవు. మరో 50 మంది విద్యార్థులకు పులిహోరా భోజనం కూడా వండలేదు. విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని మధ్యాహ్నభోజన నిర్వాహకులు, హెచ్ఎం మధుసూదనరావును ప్రశ్నించారు. కొద్దిరోజులుగా కడుపునిండా భోజనం పెట్టడంలేదని పిల్లలు చెబుతున్నారని, దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలపై చిన్నచూపు తగదంటూ మండిపడ్డారు. భోజన నిర్వాహకులకు సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప పిల్లలను ఆకలితో ఉంచడం మంచిది కాదన్నారు. తల్లిదండ్రుల ఆందోళన చేయడంతో అప్పటికప్పుడు మిగిలిన విద్యార్థులకు గుడ్లు, పులిహోరా వండి వడ్డించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హెచ్ఎం తెలిపారు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్
- ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ బి.విజయభాస్కర్



హాజరైన ప్రధానోపాధ్యాయులు

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యలో విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. పాఠశాల మెరుగైన నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు బాధ్యత ప్రధానోపాధ్యాయులు వహించాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన వాతావరణాన్ని పాఠశాలలో రూపొందించుకోవాలని హితవు పలికారు. బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు మెరుగుపరుచుకుంటూ విద్యాప్రమాణాల పెంపు జరగాలని ఆదేశించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాల పంపిణీ పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ ఎన్.ప్రేమకుమార్, డిప్యూటీ డీఈఓలు కె.మోహనరావు, కె.వెంకటరమణ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి వేదాశీస్సులు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.